నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం నవంబర్ 22, 2024 www.navatelangana.com

టెట్ దరఖాస్తు గడువు పొడగించాలి

- డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరేష్



నవతెలంగాణ-కంఠేశ్వర్

టెట్ దరఖాస్తు తేదీ గడువు పెంచాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరేష్ కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 7వ తేదీ నుండి 20వ తేదీ వరకు టెట్ దరఖాస్తుల గడువు తేదీని ప్రకటించిందని, కానీ సాంకేతిక కారణాలతో చాలామంది విద్యార్థులు పూర్తిస్థాయిలో దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు లక్ష మంది విద్యార్థులు చేసుకోవాల్సి ఉందని తెలిపారు. ఇప్పటివరకు 2.48 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, ఇందులో పేపర్ 1కు- 71,000, పేపర్ 2కు 1.55 లక్షలు, రెండు పేపర్లు రాసేవారు సుమారు 20,000 దరఖాస్తు చేసుకున్నగట్టు తెలిఆరు. దరఖాస్తు తేదీని పొడిగిస్తే ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. కావున దరఖాస్తు గడువు తేదీ మరో రెండు వారాలు పెంచాలని కోరారు.

జీజీహెచ్‌ను సందర్శించిన పోలీస్ శాఖ డీజీ



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని గురువారం తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ డైరెక్టర్ జనరల్ ఎస్ పి ఎఫ్ హైదరాబాద్ (డీజీ) అనిల్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో సిబ్బంది పెంచాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డీజీని కోరినట్టు తెలిపారు.

రైతు వేదికలో సౌకర్యాలు నిల్

- అధ్వానమైన మరుగుదొడ్లతో మహిళా అధికారుల ఇబ్బందులు
- కనీసం తాగునీరు లేని దుస్థితి
- నిర్వహణ నిధులు రాక అధికారుల జేబుకు చిల్లు
- పలు చోట్ల ఆదరణ కరువై అధ్వానంగా మారిన వైనం
- అటువైపు కన్నెత్తి చూడని అధికారులు

నవతెలంగాణ-రామారెడ్డి/బోధన్

నాడు వైభవంగా వెలుగొందిన రైతు వేదికలు.. నేడు సమస్యల వలయాల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. నిర్వహణ నిధులు లేక, పట్టించుకునే నాథుడు లేక రైతు వేదికలో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. నీటి సౌకర్యం లేక మరుగుదొడ్లు ఉపయోగంలో లేక మహిళా అధికారులు, మహిళా రైతులు ఇక్కట్లు పడుతున్నారు. పలు చోట్ల అధికారులు తమ జేబుల నుంచి వెచ్చిస్తూ పలు పనులు చేపడుతుండగా.. మరికొన్ని చోట్ల రైతు వేదికలు ఆదరణ కరువైయ్యాయి.

తెలంగాణ ఏర్పడిన తర్వాత రైతులకు అవగాహన సదస్సులతో పాటు, వ్యవసాయ అభివృద్ధి కోసం రైతులంతా సంఘటితమై చర్చించుకొనడానికి ఓ వేదిక ఉండాలని ఉద్దేశంతో 2020లో రూ.22 లక్షలతో, 5000 ఎకరాలకు ఒక క్లస్టర్‌గా రైతు వేదికలను నిర్మించారు. 2022 ఏప్రిల్ నుండి రైతు వేదికల విద్యుత్ బిల్లులు, మౌలిక వసతులు కల్పన, మరుగుదొడ్ల నిర్వహణ, త్రాగునీరు సౌకర్యం కల్పించడానికి ఒక్కో రైతు వేదికకు రూ 9000 అందజేస్తామని చెప్పి, కేవలం 5 నెలలే మంజూరు చేసి ఆనాటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం చేతులు దులుపుకుంది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తవుతున్న రైతు వేదికల నిర్వహణ నిధులు మంజూరు చేయకపోవడంతో రైతు వేదికలు సమస్యలకు నిలయాలుగా మారాయి. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 104 వ్యవసాయ క్లస్టర్ల పరిధిలో రైతు వేదికలను నిర్మించారు. ఈ క్లస్టర్ల పరిధిలో 60 శాతం మహిళా అధికారులు పనిచేస్తున్నారు. దేశా ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా రైతును అభివర్ణిస్తారు. కానీ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వాలు సవతితల్లి ప్రేమనే చూపిస్తున్నాయి. రైతు వేదికల్లో నీటి సౌకర్యం లేక మరుగుదొడ్లల్లో దుర్గంధం వెదజల్లుతుంది. కనీస తాగునీటి సౌకర్యం కూడా లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనంగా రైతు వేదికలు కనబడుతున్నాయి. మరుగుదొడ్లు వాడుకునే పరిస్థితుల్లో లేకపోవడంతో మహిళ అధికారుల, రైతుల ఆత్మగౌరవం దెబ్బతింటుంది. అనారోగ్యం పాలవుతున్నారు.

స్కావెంజర్లు లేక అధికారులే రైతు వేదికలను శుభ్రం చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఒక్కో రైతు వేదికకు దాదాపు రూ 500 నుండి 600 వరకు విద్యుత్ ఛార్జీలు వస్తుండటంతో కొందరు అధికారులు తమ జేబు నుంచి చెల్లిస్తున్నారు. మరికొన్ని చోట్ల చెల్లించకపోవడంతో ఒక్కో రైతు వేదిక దాదాపు రూ.10 వేల వరకు కరెంట్ బిల్లులు బకాయిలో పడ్డాయి. దాదాపు 60 శాతం ప్రభుత్వ కార్యక్రమాలన్నీ రైతు వేదికల్లోనే సభలు, సమావేశాలతో పాటు ప్రజా ప్రతినిధుల, అధికారుల కార్యక్రమాలను నిర్వహిస్తున్న ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో రైతు వేదికలో సమస్యలు రైతులను, అధికారులను వెంటాడుతున్నాయి. ప్రభుత్వం వెంటనే నిర్వాహన నిధులను మంజూరు చేసి రైతు వేదికల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.





రామారెడ్డిలోని రైతు వేదికలో నీళ్ల లేక నిరుపయోగంగా.. మరుగుదొడ్డిలో పెరిగిన పిచ్చిమొక్కలు

ఆదరణ కరువైన రైతువేదికలు

బోధన్ : పలు క్లస్టర్ల పరిధిలో నిర్మించిన రైతు వేదికలను వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దాంతో అవి పలుచోట్ల నిరుప యోగంగా మారాయి. మరికొన్ని చోట్ల మాత్రమే వివిధ కార్యక్ర మాలకు వినియోగిస్తున్నారు.

బోధన్ ఉమ్మడి మండలంలో బోధన్ ఏఎంసీ వద్ద, సాలూరలో, హున్స, జాడీజమాల్‌పూర్, కల్దుర్కి, సిద్దాపూర్, అమ్దాపూర్, పెగడాపల్లి, సంగం, భవానిపేట్, పెంటాఖుర్ద్ గ్రామాల్లో 20 లక్షలతో ఒక్కోక్క రైతు వేదిక నిర్మించారు. హున్స గ్రామంలోని రైతు వేదిక ఊరికి దూరంగా ఉందనే కారణంతో ఏఈఓ అటువైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. దాంతో రైతువేదిక దుమ్ము, ధూళితో కళావిహీనంగా తయారయింది. టైల్స్ పగిలినా పట్టించుకునేవారు లేరు. మరుగుదొడ్ల తలుపులు ధ్వంసమయ్యాయి. మరుగుదొడ్లకు ఉపయోగించవలసిన నీటి ట్యాంకు రైతువేదికలో మూలన పెట్టేశారు. సాలూర రైతు వేదికలో అప్పుడప్పుడు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే అమ్దాపూర్ రైతు వేదికలలో ఐసీడీఎస్ కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. కానీ మిగతా చోట్ల ఎక్కడ కూడా ఎలాంటి కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించకపోవడం వలన అవి నిరుపయోగంగా మారాయి. అధికారులు స్పందించి రైతులకు సంబంధించిన కార్యక్రమాలు, అవగాహన సదస్సులు రైతు వేదికలలో నిర్వహించి వాటిని వినియోగంలో తీసుకురావాలని ఆయా క్లస్టర్ పరిధిలోని రైతులు కోరుతున్నారు.



బోధన్ మండలం హున్సా రైతు వేదిక చుట్టూ పెరిగిన గడ్డి..



పైన ఉండాల్సిన ట్యాంక్ రైతు వేదికలో..

నిర్వహణకు నిధులు మంజూరు చేయాలి

గాండ్ల సాయిలు. కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు. రామారెడ్డి



ప్రభుత్వం రైతు వేదికలకు నిర్వాహణ ఖర్చుల్లో భాగంగా పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే మంజూరు చేసి రైతు వేదికల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. రైతు వేదికల్లో రైతు సంక్షేమం కోసం , నూతన రీతిలో వ్యవసాయ పద్దతులను రైతులకు అవగాహన కల్పిస్తూ వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చవలసిన బాధ్యత ప్రభుత్వం పై ఉంది. మరుగుదొడ్లు వాడుకంలో లేకపోవడంతో మహిళా అధికారులకు, మహిళా రైతులకు ఇబ్బందిగా ఉంది. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించి వెంటనే పరిష్కరించాలని రైతుల పక్షాన డిమాండ్ చేస్తున్నాము.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ కార్మిక, రైతు సంఘాల నాయకులు

పెరిగిన ధరలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

- 26న దేశవ్యాప్త నిరసనలు జయప్రదం చేయాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో కార్మిక, రైతు సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలతో ధనికులు, పేదల మధ్య అంతరాయం పెరుగుతోందని, పర్యావసానంగా నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగి సామాన్యుడు అందుకోలేని విధంగా ఉన్నాయని, ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ఉద్యమిద్దామని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. కార్మిక, రైతు, వ్యవసాయ కూలీ సంఘాల ఐక్య కార్యకరణ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని నాందేవ్‌వాడలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. దాసు, ఏఐకేఎస్ రాష్ట్ర నాయకులు కంజర భూమయ్య మాట్లాడారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. రైతు ఉద్యమ సమయంలో దేశ రైతాంగానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలన్నారు. ఉచిత నాణ్యమైన విద్య, వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే చర్యలను ఆపాలన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఉద్యోగ ఆరోగ్య భద్రత కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 26న జరిగే నిరసన ప్రదర్శనను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్, ఎస్‌కేఎం జిల్లా బాధ్యులు వి. ప్రభాకర్, ఏకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఏఐపీకేఎస్ జిల్లా అధ్యక్షుడు సాయన్న, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ బాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, వివిధ రంగాల నాయకులు గంగారెడ్డి, రాజేశ్వర్, శివకుమార్, గణేష్, సాయిబాబా, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలపై తిరుగుబావుట

- ఏండ్లుగా పార్టీకి సేవ చేస్తున్నా.. తమను పట్టించుకోవడం లేదని సీనియర్‌ల నిరసన
- వలస వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపాటు
- గాంధీభవన్ ఎదుట, బీర్కూర్‌లో ధర్నా చేపట్టిన జుక్కల్, బాన్సువాడ నాయకులు
- అటు కాంతారావ్‌పై, ఇటు పోచారంపై అధిష్టానానికి ఫిర్యాదు



హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఎదుట ధర్నా చేపట్టిన జుక్కల్ నియోజకవర్గంలోని మండలాల నాయకులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్(బాన్సువాడ)/
జుక్కల్ నియోజకవర్గ విలేకరులు

కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో నివురుగప్పిన నిప్పులా ఉన్న అసంతృప్తి ఒక్కసారిగా బయటకు వచ్చింది. ఏండ్లుగా పార్టీకి సేవ చేస్తున్న తమను ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదని మండిపడుతూ ఆందోళన బాట పట్టారు. పార్టీకోసం సర్వస్వం ధారపోస్తే.. వలస వచ్చిన నేతలనే అందలం ఎక్కిస్తు న్నారని వాపోయారు. గ్రూపులుగా విడిపోయిన పలువురు నాయకులు అటు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఇటు జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మికాంత్‌రావ్‌కు తీరుతో విసిగిపోయి ఆందోళన చేపట్టారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వ్యతిరేకంగా బీర్కూర్ మండల కేంద్రంలోని కామప్ప చౌరస్తాలో నాయకులు ధర్నా చేపట్టారు. జుక్కల్ నియోజక వర్గంలోని నాయకులు ఏకంగా హైదరాబాద్‌లోని గాంధీ భవన్ ఎదుట ధర్నా చేపట్టి పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు.


కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రాధాన్యత ఇవ్వకుండా వలస నేతలకే ఇస్తున్నారంటూ ఏనుగు రవీందర్‌రెడ్డి గ్రూప్‌నకు చెందిన నాయకులు గురువారం బీర్కూర్ మండల కేంద్రంలోని కామప్ప చౌరస్తాలో ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నుంచి వలస వచ్చిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాత కాంగ్రెస్ నాయకులకు బీర్కూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి ఇవ్వకుండా వలస వచ్చిన అనుచరులకు ఇచ్చారని మండిపడ్డారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ కార్యదర్శి బస్వరాజ్ పటేల్, దామరంచ సొసైటీ ఛైర్మన్ కమలాకర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్ యాదవ్, పీసీసీ మాజీ కార్యదర్శి అహ్మద్, మాజీ ఎంపీటీసీ పోగు నారాయణ, నసురుల్లాబాద్ మాజీ సర్పంచ్ అరిగే సాయిలు, తుమ్ సాయ గౌడ్, ప్రసాద్, మాజీ సర్పంచ్ పుల్లెన్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.



బీర్కూర్‌లో ధర్నా చేపట్టి నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గాంధీ భవన్‌లో జుక్కల్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు

జుక్కల్ నియోజకవర్గం విలేకరులు : కాంగ్రెస పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మికాంతారావు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. గురువారం గాంధీ భవన్‌లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుపై.. పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలోని ఎనిమిది మండలంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలను కాకుండా బీఆర్ఎస్, బిజెపి వాళ్లను వెంటేసుకుని తిరుగుతున్నాడని తమను పట్టించుకోవడంలేదని కాంగ్రెస్ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. 20 సంవత్సరాలుగా నుండి కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేస్తూ తాము గెలిపిస్తే ఆయన నామినేటెడ్ పదవులు వేరే వారికి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సౌదాగర్ అరవింద్, కమల్ సెట్, వినోద్, సంగమేశ్వర, జయ ప్రదీప్, అన్ని మండలాల సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



శిక్షణ పూర్తి చేసుకున్న 250 మంది కానిస్టేబుల్స్

కానిస్టేబుళ్ల పాసింగ్ అవుట్ పరేడ్

- ఏఆర్ కానిస్టేబుళ్లకు ముగిసిన శిక్షణ

నవతెలంగాణ-ఎడపల్లి

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాన్కంపేట లోని కమిషనరేట్ శిక్షణ కేంద్రం నందు సైబరాబాద్ నుండి ఎ.ఆర్ క్యాటగిరిలో కానిస్టేబుల్స్ ఎంపిక కాబడిన స్టయిపండరీ క్యాడెట్ ట్రెయినీ కానిస్టేబుల్స్‌కు 9 నెలల శిక్షణ గురువారంతో ముగిసింది. ఈ శిక్షణ ముగింపు కార్యక్రమంలో 250 మందికి నేడు " దీక్షాంత్ పరేడ్ (పాసింగ్ అవుట్ పరేడ్) కార్యాక్రమం నిర్వహించగా ముఖ్యఅతిధులుగా తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ,ఎస్.పి.ఎఫ్ డా అనిల్ కుమార్ పాల్గొన్నారు. శిక్షణ పొందిన కానిస్టేబుళ్ల నుండి గౌరవ వందనం పొందారు. అనంతరం కానిస్టేబుళ్లతో ప్రిన్సిపల్ బి. కోటేశ్వర్ రావ్ ప్రమాణం చేయించారు.



కానిస్టేబుళ్ల గౌరవ వందనం స్వీకరిస్తున్న పోలీస్ అధికారులు



శిక్షణలో ప్రతిభ చాటిన కానిస్టేబుళ్లకు మెమోంటోలు

ఈ సందర్భంగా ముఖ్య అతిధి డైరెక్టర్ జనరల్ మాట్లాడుతూ కానిస్టేబుల్ శిక్షణ తీసుకన్నటువంటి వారికి అభినందనలు తెలియజేశారు. మీలో 80 శాతం మంది గ్రాడ్యుయేట్లు, 20 శాతం మంది పోస్టు గ్రాడ్యుయేట్లు ఉన్నారు. కాబట్టి మీ విధులను సక్రమంగా బాధ్యతలతో నిర్వహిస్తారని, అంతేకాకుండా మీ అందరికీ మీ జీవితాలలో గుర్తు పెట్టుకునే ఒక సుదినమని అన్నారు. జీవితాల్లో ఒక మైలురాయి వంటిది అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 శిక్షణ కేంద్రాలు నుండి ఈ రోజునా పాసింగ్ అవుట్ కార్యాక్రమాలు నిర్వహిస్తున్నారని, జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీస్ కు దేశంలో మంచి గుర్తింపు ఉందని, మీరంతా మీ విధులు సక్రమంగా నిర్వహించి. మంచిగా రానిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.'

శిక్షణలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించిన బెస్ట్ ఇండోర్: ఎ. రాజు, బెస్ట్ అవుట్ డోర్: ఎమ్. నరేష్, బెస్ట్ ఫైరర్ : ఎ.క్రాంతి కుమార్, ఒవరాల్ చాంపియన్ కె. హర్ష వర్ధన్, పరేడ్ కమాండర్: జె.వాసుకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీపీ సి.హెచ్. సింధు శర్మ, సీటీసీ వైస్ ప్రిన్సిపల్ మస్తాన్ అలీ, అదనపు డి.సి.పి లు ,7వ బెటాలియన్ అడిషనల్ కమాండెంటు, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, స్పెషల్ బ్రాంచ్, సిసిఎస్, ట్రాఫిక్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఇసుక రవాణా..?

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలో అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా జోరుగా అక్రమ ఇసుక రవాణా సాగుతుందని పట్టణవాసులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి వే బిల్లులు లేకుండా జీరో దందా ద్వారా ఇసుకను రవాణా చేస్తున్నారు. మద్నూర్, జుక్కల్ పరిసర ప్రాంతాల నుంచి పట్టణానికి చెందిన ఓ వ్యక్తి మద్నూర్ నుంచి పట్టణ కేంద్రంలో మరో వ్యక్తిని ఏర్పాటు చేసుకుని రవాణా చేస్తున్నట్లు సమాచారం. గృహ అవసరాల కోసం ఇసుక అవసరమున్న వారిని గుర్తించి వారికి తక్కువ ధరకు రాత్రి సమయంలో ఇసుకను సరఫరా చేస్తామని తెలియజేసి దందాను కొనసాగిస్తున్నట్లు సమాచారం. వే బిల్లులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న వారిని గుర్తించి అడ్డుకట్ట వేయాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.



రాష్ట్రపతికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ అరవింద్

రాష్ట్రపతికి స్వాగతం పలికిన ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆర్మూర్/నిజామాబాద్‌సిటీ

రెండురోజుల రాష్ట్ర పర్యటనలో భాగంగా హైదరాబాద్‌కు విచ్చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు నిజామాబాద్ ఎంపీ అరవింద్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి స్వాగతం పలికారు. గురువారం బేగంపేట్ ఎయిర్‌పోర్టులో రాష్ట్రపతికి పుష్పగుచ్ఛం అందజేశారు.



స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే పైడిరాకేశ్‌రెడ్డి

విద్య, వైద్యం, ఉపాధి అందించాలి

- తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

పేద ప్రజలకు విద్యా వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ నాయకులు తెలిపారు. గురువారం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య, అత్యాధునికమైన వసతులతో మంచి వైద్యం, పనికి తగ్గిన వేతనంతో ఉపాధి, నివసించడానికి నాలుగు గదుల ఇల్లు, చేసుకోవడానికి అర్హులైన వారికి సాగునీటితో కూడిన ఎకరం భూమి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో వేలాది మందితో రోడ్డుపైకి వచ్చి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జక్రాన్‌పల్లి మండల్ అధ్యక్షులు మహేష్, కోశాధికారి దిలీప్, మండల నాయకులు చిన్న భూమన్న, గంగాధర్, మీడియా ఇంచార్జి రవి, సంజయ్ మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం 23న ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి బి. పి మధుసూదన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాకు మెడ్‌ప్లస్, వరుణ్ మోటార్స్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్, రిలేషన్ షిప్ మేనేజర్, సూపర్ వైజర్, అడ్వయిజర్, జూనియర్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్, ఆడిట్ అసిస్టెంట్, సిఎస్ఏల ఉద్యోగుల నియాకాలు చేపడుతారని తెలిపారు. ఇంటర్మీడియట్, బి.ఫార్మ్, ఎం.ఫార్మ, డిప్లొమా, ఐటిఐ, డిగ్రీ, పాసైనా స్త్రీ, పురుషులు అర్హులని, నిజామాబాద్, ఆర్మూర్, కామారెడ్డి ప్రాంతాల్లో ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయం, శివాజీ నగర్, నిజామాబాద్‌లో 23న పాల్గొనాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఈ ఫోన్ 9581768413, 9948748428, 6305743423, 7702259070 కు సంప్రదించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ బయో డేటా, ఆదార్ కార్డు, పదవ తరగతి మెమో, ఫోటో తీసుకురాగలరు సూచించారు.

ఆర్థిక సహాయం చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని హాసకొత్తూర్, చౌట్‌పల్లి గ్రామాలలో గురువారం పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు చేసిన ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి సునీల్ రెడ్డి చొరవతో ప్రభుత్వం ఏడుగురు లబ్ధిదారులకు ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం చెక్కులను మంజూరు చేసింది. చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. చెక్కుల మంజూరుకు కృషి చేసిన ముత్యాల సునీల్ కుమార్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగేల ప్రవీణ్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు రేవతి గంగాధర్, చౌట్ పల్లి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్ముల రవీందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

27 మందికి కంటి వైద్య పరీక్షలు

నవతెలంగాణ-బాల్కొండ



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఫోర్ట్ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మమతా బావయ్య కాంప్లెక్స్‌లో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 27 మందికి వైద్యురాలు ప్రవల్లిక కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షులు అందే వెంకటగిరి, సెక్రటరీ ద్యావతి పోశెట్టి, ట్రెసరర్ కటికె శ్రీనివాస్, సభ్యులు చౌటి కిషన్, భూస రత్నాకర్ పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ కేజీబీవీ విద్యార్థులు ఉషు రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ఎస్వో జి.వినోద గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఇటీవల ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి ఉషు క్రీడల్లో పాఠశాల నుండి 8మంది విద్యార్థినులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా 9వ తరగతి విద్యార్థిని యం.మహేశ్వరి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. మిగిలిన విద్యార్థులు రాష్ట్ర క్రీడల్లో బంగారు పతకాలు సాధించారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్, విద్యార్థులు పాల్గొన్నారు..

గంజ్‌లో కూరగాయల విక్రయం

- తీరిన ట్రాఫిక్ సమస్య
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్ణయంపట్ల ప్రజల హర్షం



నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

గత పది సంవత్సరాలుగా కూరగాయల వ్యాపారస్తులు, రైతులు పాత గంజ్ లో గల కూరగాయల మార్కెట్‌లో కాకుండా రోడ్‌పై విక్రయాలు చేసేవారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రజలు అవస్థలు పడేవారు. నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముప్ప గంగారెడ్డి బాధ్యతలు తీసుకున్న తరువాత రోడ్డుపై విక్రయిస్తున్న వ్యాపారస్తులకు, రైతులకు పాత గంజ్‌లో స్థలం కేటాయించారు. వారికి ఇచ్చిన స్థలంలోనే విక్రయాలు జరపాలని ఆదేశాలు జారీ చేశారు. రోడ్డుపై అక్రమంగా విక్రయాలు చేస్తే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నిర్ణయం పట్ల ప్రజలు, వ్యాపారస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభమైన ఆన్‌లైన్ డాటా ఎంట్రీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ప్రారంభమైనట్లు ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన తహసిల్దార్ ఆంజనేయులు తో కలిసి ఆన్ లైన్ డాటా ఎంట్రీని వారు పరిశీలించారు.సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) వివరాలను ఆన్ లైన్ చేయడంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త పడాలని డాటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. కుటుంబ సభ్యుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయించేటప్పుడు ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆన్ లైన్ చేసేటప్పుడు ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి నివృత్తి చేసుకోవాలన్నారు.

రెండు కార్లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రెండు కార్లు ఢీకొని ఇద్దరికీ తీవ్ర గాయాలైన ఘటన జాతీయ రహదారి-44 ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవి తండా వద్ద గురువారం చోటుచేసుకుంది. అదుపు తప్పి ఒక కారు రెయిలింగ్ పైకి దూసుకెళ్లగా ఎదురుగా వస్తున్న మరో కారు దానిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక కారులో ముగ్గురు, మరో కారులో ఇద్దరు ఉండగా, ఇద్దరికీ తీవ్ర గాయాలైనట్లు ఎస్‌హెచ్‌ఓ మనోజ్ కుమార్ తెలిపారు. ఎస్‌హెచ్‌ఓ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణానికి చెందిన బోలేనత్ ,స్వరూప,బలరాం కలిసి బోధన్ నుండి కామారెడ్డి కి వెళ్తుండగా దేవితండ వద్దకు వచ్చేసరికి హైదరాబాద్ నుండి బాసర కు వెళ్తున్న కారు డ్రైవర్ అతి వేగంగా అజాగ్రత్తగా నడిపించడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.

దీంతో అందులోని వారికి గాయాలు అయ్యాయి.బాదితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చెసి టోల్ ప్లాజా హైవె అంబులెన్స్ లో

చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించినట్లు ఎస్ హెచ్ ఓ మనోజ్ కుమార్ తెలిపారు.అదే సమయంలో జాతీయ రహదారి కి ఇరువైపుల పెద్ద వాహనాలు రాకపోకలు సాగలేదు.లేకుంటే భారీ ప్రమాదం చోటు చేసుకునే దాని స్థానికులు వివరించారు.అదే సమయంలో కోద్ది సేపు ట్రాఫిక్ జామ్ కావడంతో ఎస్ హెచ్ ఓ మనోజ్ కుమార్ తన సిబ్బందితో కలిసి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

ఉర్దూ భాషలో మరింత పరిశోధనలు జరపాలి

- వైస్ ఛాన్సలర్ టి యాదగిరిరావు

నవతెలంగాణ-డిచ్‌పల్లి


లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డును అందుకుంటున్న మహమ్మద్ అబ్దుల్ ఖవి

ఉర్దూ భాషలో మరింత పరిశోధనలు జరిపి యూనివర్సిటీకి గుర్తింపు తీసుకురావాలని తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ టి యాదగిరిరావు అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ ఉర్దూ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖవి ప్రతిష్టాత్మక రాష్ట్ర ప్రభుత్వ తెలంగాణ ఉర్దూ అకాడమీ చే పరిశోధన-విమర్శ రంగంలో లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు అందుకోవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ అబ్దుల్ ఖవిని శాలువాతో సన్మానించారు. గత పది సంవత్సరాలుగా యూనివర్సిటీలో వివిధ అకాడమిక్, అడ్మినిస్ట్రేటివ్ పదవులలో సమర్థవంతంగా నిర్వహిస్తున్న అబ్దుల్ ఖవి ఈ ప్రతిష్టాత్మక లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు అందుకోవడంతో తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (టూటా) అధ్యక్షులు డాక్టర్ ఏ.పున్నయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ బాబు, ఉపాధ్యక్షులు డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, కోశాధికారి డాక్టర్ నాగరాజ్, డాక్టర్ జమీల్ డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ బాలకిషన్, డాక్టర్ నీలిమ, అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

జీతాలు అందించండి

- ఎంపీడీవోకు కారోబార్‌ల వినతి

నవతెలంగాణ-మోపాల్


ఎంపీవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న కారోబార్‌లు

మండలంలోని గ్రామ పంచాయతీ కారోబార్, పారిశుధ్య కార్మికుల జీతాల కోసం ఎంపిడిఓ రాములు నాయక్, ఎంపీవో కిరణ్‌కు వినతి పత్రం గురువారం అందజేశారు. గత కొన్ని నెలల నుంచి జీతాలు లేక కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు. జిల్లా ట్రెజరీ కార్యాలయంలో చెక్కులు జమచేసిన ఇప్పటివరకు క్లియరెన్స్ కాలేదని వాపోయారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కారొబర్లు నందు, శ్రీనివాస్, వెను, ముకేష్, మహిపాల్, బంతిలాల్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు క్రీడలు ఎంతో ముఖ్యం

జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్

నవతెలంగాణ-కంఠేశ్వర్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

దివ్యాంగ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని, వారిలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ప్రభుత్వం ఈ క్రీడలు నిర్వహిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు జిల్లా మహిళా శిశు దివ్యాంగ వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రవీంద్ర జైన్ అంధుడు అయినప్పటికి ఆయన స్వరకర్తగా గేయ రచయితగా గాయకుడుగా రామాయణ సీరియల్‌కి పనిచేసారని తెలిపారు. మనందరం చందు ఛాంపియన్ సినిమా చూడాలని అది ఒక దివ్యాంగుడికి సంబందించిన సినిమా అన్నారు. ఒక దివ్యాంగుడు పారఒలింపిక్‌లో స్వర్ణ పథకం సాధించాడన్నారు. మనోధైర్యంతో ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ మాట్లాడుతూ.. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం 2024లో భాగంగా విభిన్న ప్రతిభావంతుల క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్యారం, రన్నింగ్, షాట్ పుట్, చెస్ క్రీడలను నిర్వహించనున్నట్టు ఆమె వివరించారు. కార్యక్రమంలో జిల్లా శిశుసంక్షేమ శాఖ సుపెరిండెంట్ ఇందిరా, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, ఏపీఫోరం సెక్రెటరీ స్వరూప, గ్రేసీ డెఫ్ స్కూల్ నిర్వాహకురాలు శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం


సన్మానించిన పలువురు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నర్సాపూర్ పాఠశాలలో తొమ్మిది సంవత్సరాలు తన అమూల్యమైన సేవలు అందించి బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు రాధా కిషన్, ఉపాధ్యాయులు శారద, శేఖర్‌లను గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించి, పూలమాల, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఉద్యోగ బదిలీతో ఇంతకాలం ఉన్న సంబంధం ముగిసినట్టుగా అనుకోవద్దని, తమ పిల్లలకు అందించిన సేవలు జీవితాంతం గుర్తుంచుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పడాల పురంధర్, గ్రామ కమిటీ అధ్యక్షులు జాగిర్యాల ఎర్రన్న పోతుగంటి శ్రీనివాస్, మల్కయ్య సంజీవ్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మానాల


వధూవరులను ఆశీర్వదిస్తున్న మానాల మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని జలాల్‌పూర్‌లో కాంగ్రెస్ కార్యకర్త రంజిత్ వివాహానికి తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి హాజరై నూతన వధూవరుడును గురువారం ఆశీర్వదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గున్నాల వెంకటేష్ గౌడ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యంరెడ్డి, డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, కిషన్ గౌడ్, బాల్కొండ పట్టణ శాఖ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, కిసాన్ నగర్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంగాధర్, ముప్కాల్ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా డాటా ఎంట్రీ చేపట్టాలి

- స్పెషల్ ఆఫీసర్ యోహాన్, ఎంపిడిఓలు రవీందర్, లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి


డాటా ఎంట్రీ గురించి వివరిస్తున్న అధికారి

తప్పులు లేకుండా డాటా ఎంట్రీ చేపట్టాలని స్పెషల్ ఆఫీసర్ యోహాన్, ఎంపిడిఓలు రవీందర్, లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఇందల్‌వాయి మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో డాటా ఎంట్రీపైన ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వేకు సంబందించిన డాటా ఎంట్రీ చేపట్టేటప్పుడు ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓలు శ్రీనివాస్‌గౌడ్, రాజ్‌కాంత్ రావు, మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్, మండల రెవెన్యూ అధికారి సంతోష్, మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ప్రైవేట్ కంప్యూటర్ ఆపరేటర్లు, పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో విజేతలుగా విజయ్ విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా గ్రంథాలయ సంస్థ, నిజామాబాద్ ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుండి 20 వరకు జరిగాయి. ఈ వారోత్సవాల్లో పలురకాల పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలుపాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజయ్ హై స్కూల్ లో 9 వ తరగతి విద్యార్థులు ఆర్.శ్లోక జికెలో ప్రథమ బహుమతి, వ్యాసరచనలో కన్సోలేషన్ బహుమతి అందుకున్నట్టు తెలిపారు. పాటల పోటీలో నాగదీక్ష (9వ తరగతి) ద్వితీయ బహుమతి, క్రిషకు (5వ తరగతి) కన్సోలేషన్ బహుమతి, చిత్రలేఖనంలో బి. శ్రీనిత్య (9వ తరగతి) కన్సోలేషన్ బహుమతులు, టి.మిశిక (3వ తరగతి) నటన (కాళిమాత) విభాగంలో తృతీయ బహుమతి లభించినట్టు తెలిపారు.

ఓపెన్ నేషనల్ యోగా పోటీలకు విజయ్ విద్యార్థిని

ఇంటర్నేషనల్ గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి యోగా పోటీలు ఈనెల 14 నుండి 17 వరకు బెంగళూరులో జరిగాయి. ఈ పోటీల్లో విజయ్ హై స్కూల్లో 9వ తరగతి చదివే జునేరా హుస్సేన్ పాల్గొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం విద్యార్థులనందరిని అభినందించారు.



స్కౌట్స్ అండ్ గైడ్స్ వేడుకలో..

ప్రతిభ కనబరచడం అభినందనీయం

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

నవతెలంగాణ-సిరికొండ

స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ వేడుకల్లో నిజామాబాద్ జిల్లా తరపున పాల్గొని ప్రతిభ కనబరచడం అభినందనీయమని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు నేటి సాంకేతిక పోటీ ప్రపంచంలో సంపూర్ణ విషయ పరిజ్ఞానం పొందేందుకు ప్రణాళిక బద్దంగా విద్యనభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. హైదరాబాద్‌లో జరిగిన 75 వసంతాల స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర స్థాయి వ్యవస్థాపక దినోత్సవ 'డైమండ్ జూబ్లీ వేడుకల్లో జిల్లా తరపున సత్యశోధక్ పాఠశాలకు చెందిన 16మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొని వివిధ అంశాలలో అద్భుత ప్రతిభ కనబరిచి కలర్ పార్టీలో మొదటి స్థానంతో పాటు క్యాంప్ క్రాఫ్ట్, ఎగ్జిబిషన్, భౌతిక మరియు సాంస్కృతిక ప్రదర్శనలో ఉత్తమ గ్రేడ్, అవార్డులు సాధించిన సత్యశోధక్ పాఠశాల విద్యార్థులను గురువారం కలెక్టర్ తన కార్యాలయంలో ప్రత్యేక జ్ఞాపికలను అందించి సత్కరించారు.

జిఓ.నెం.29 రద్దు చేయాలి

- పిడిఎస్‌యు
- యూనివర్సిటీ గ్రంథాలయం ఎదుట నిరసన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్రంలోని గ్రూప్-1 నియామకాల భర్తీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ వర్గాల అభ్యర్థుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీసే జి.ఓ.నెంబర్.29 రద్దు చేయాలని జీవో నెంబర్ 55ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీ గ్రంథాలయం ముందు పీడీఎస్‌యు విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాజకీయ బేషజాలకు పోకుండా గ్రూప్-1 అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేయడానికి తక్షణమే అభ్యర్థులతో చర్చలు జరపాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్స్ అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించుకుంటారన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ వర్గాల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీయాలని చూస్తే రేవంత్‌రెడ్డి సర్కార్ తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబా, రమేష్, రాజు, గ్రూప్స్ అభ్యర్థులు, తదితరులు పాల్గొన్నారు.

లిల్లీపుట్ పాఠశాలలో ఒలంపియాడ్ పరీక్ష


పరీక్ష రాస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాల విద్యార్థులకు రామానుజన్ మహెూత్సవ సందర్భంగా ఒలంపియాడ్ పరీక్షలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ రామకృష్ణ మాట్లాడుతూ.. తమ పాఠశాలలో ప్రతి సంవత్సరం ఒలంపియాడ్ పరీక్ష నిర్వహిస్తామని, తమ పాఠశాల నుంచి ఎంతో మంది ఉత్తీర్ణతలు సాధించి బహుమతులు అందుకున్నారని తెలిపారు. ఒలంపియాడ్ పరీక్ష నిర్వహణ వలన విద్యార్థులకు సబ్జెక్టుపైన పూర్తి అవగాహన వస్తుందని, ప్రతి సబ్జెక్టును క్షుణ్ణంగా నేర్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ దాసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
శుక్రవారం | నవంబర్ 22, 2024 | www.navatelangana.com

కామారెడ్డి ఎమ్మెల్యే కుటుంబ వివరాలను సేకరించిన సర్వే అధికారులు



నవతెలంగాణ-కామారెడ్డి

సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ప్రముఖుల వివరాలు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్టు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక శాసనసభ్యులు కే.వెంకట రమణారెడ్డి కుటుంబ వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణు గోపాల్, ఎన్యుమారేటర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామానికి చెందిన సూపర్ టీవీ జర్నలిస్ట్ ఆశన్న తల్లి అనారోగ్యంతో మృతి చెందగా గురువారం జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో రగోతంరెడ్డి, గాంధారి ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ పి.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నారెడ్డి మోహన్‌రెడ్డి

ముదిరాజుకూ సభ్యత్వం ఇవ్వాలి

- ముదిరాజ్ మండల కమిటీ డిమాండ్

నవతెలంగాణ-లింగంపేట్

ముదిరాజులే అసలైన మత్స్యకారులని ప్రతి ముదిరాజ్‌లకు సభ్యత్వం కచ్చితంగా ప్రభుత్వం ఇవ్వాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మండలంలోని ఆయా గ్రామాలలో గురువారం తెలంగాణ ముదిరాజ్ మహాసభ శతాబ్ది ఉత్సవాల్లో మత్స్యకారుల దినోత్సవం భాగంగా గ్రామ గ్రామాన ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో జెండాలను ఆవిష్కరించారు. మండలంలోని సూరాయిపల్లి, బోనాల్, సజ్జనపల్లి, శెట్పల్లి సంగారెడ్డి, పొల్కంపేట్, భవానిపేట్, పోతాయిపల్లి, కన్నాపూర్, శెట్పల్లి, లింగంపేట్‌తో పాటు పలు గ్రామాల్లో గ్రామ కమిటీ అధ్యక్షులు పెద్దమ్మ ఆలయాల వద్ద ముదిరాజ్ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు సాయికుమార్, ముదిరాజ్ అధ్యక్షులు దురిశెట్టి అశోక్, ఉపాధ్యక్షులు బొల్లారం క్రాంతి కుమార్, దాసరి పరువయ్య, కిషన్, రాజారామ్, బాలయ్య, విట్టల్, అనిల్ కుమార్, శెట్పల్లి కృష్ణ బాలయ్య, తలారి బొందయ్య, బోన్ల కిష్టయ్య, కాశీరాం అంజయ్య, రమేష్, శ్రీనివాస్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న ముదిరాజ్ సభ్యులు

సర్వే పూర్తిచేసి
డాటా ఎంట్రీ ప్రారంభించాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను రానున్న రెండు, మూడు రోజుల్లో పూర్తి చేసి, డాటా ఎంట్రీ ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ నుంచి మండల ప్రజా పరిషత్, తహసీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటింటి సమగ్ర సర్వే పనులు ఎన్యుమరేషన్ బ్లాక్ వారీగా పూర్తి చేయాలని, అదేవిధంగా సేకరించిన వివరాల ఫారాలను ట్రంక్ పెట్టెల్లో భద్రపరచాలని, డాటా నమోదు ప్రారంభించాలని తెలిపారు. అవసరమైన కంప్యూటర్ ఆపరేటర్‌లను, వారికి సహాయకులను నియమించుకోవాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 11 మండలాల్లో వందశాతం ఎన్యుమరేషన్ పూర్తయిందని, మిగతా మండలాల్లో రెండు, మూడు రోజుల్లో పూర్తి చేయాలని అన్నారు. పూర్తి చేసిన ఎన్యుమరేషన్ వివరాలను డేటా ఎంట్రీ చేయాలని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 96.3 శాతం ఎన్యుమరేషన్ పూర్తయిందని తెలిపారు. డాటా ఎంట్రీ భద్రంగా తప్పులు లేకుండా నిర్వహించాలని తెలిపారు. ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. సర్వే పూర్తయిన తర్వాత ఎన్యుమరేషన్ బ్లాక్ వారీగా నిర్ణీత ధ్రువీకరణ పత్రం సమర్పించాలని తెలిపారు. మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం కింద తహసీల్దార్లు అందిన ఫారం 6,7,8లను పరిశీలించాలని తెలిపారు. తహసిల్దార్ లాగిన్‌లో ఉన్న వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, వి.విక్టర్, ఆర్డీఓ రంగనాథ్ రావు, సీపీఓ రాజారాం, మండల ప్రత్యేక అధికారులు వివిధ శాఖల అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.


వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

డీఈవోను కలిసిన మిత్రబృందం

నవతెలంగాణ-పొతంగల్

నిజామాబాదు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన మిత్రబృందం డీఈవో అశోక్‌ను గురువారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఇపి-2020 (నూతన విద్యావిధానం నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ) గురించి స్నేహ పూర్వక చర్చ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.లక్ష్మన్‌కుమార్, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ నాగేశ్వర్‌రావు, రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ ఇందూర్ శంకర్ విచ్చేసి అభినందనలు తెలిపారు.


డీఈవోను సన్మానించిన మిత్రులు

సర్వేను పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి, నీలా, సాటాపూర్, కూనేపల్లి, కిసాన్‌తండా గ్రామాలలో మండల సూపర్వైజర్ ఏపీఎం చిన్నయ్య గురువారం పర్యటించారు. ఈ ఐదు గ్రామాలకు గాను 20 మంది ఎన్యూమరేటర్లతో 98 శాతం సర్వేను పూర్తి చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ఐదు గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేశామని, అందుబాటులో లేని కొన్ని మాత్రం మిగిలిపోయాయని తెలిపారు. నేటి కల్లా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తగా సర్వే నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు.


పరిశీలిస్తున్న ఏపీఎం చిన్నయ్య

సూరాయిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని సూరాయిపల్లి గ్రామంలో తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ.. రైతులందరూ ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆవులకు, గేదెలను పరీక్షించి గర్భకోశ వ్యాధులకు తగిన చికిత్స అందించినట్టు తెలిపారు. అలాగే లింగ నిర్ధారిత వీర్యంపై అవగాహన కల్పించారు. ఈ లింగ నిర్ధారిత వీర్యం వాడడం వలన 90శాతం ఆడదూడలు మాత్రమే జన్మిస్తాయని తెలిపారు. దీనికిగాను రైతు వాటా రూ.250 చెల్లించాలని పేర్కొన్నారు. ఒకే పశువుకు వరుసగా రెండు ఎదలలో లింగ నిర్ధారిత వీర్యం, వాడిన చూలు కట్టకపోతే రైతు వాటా రూ.500 రైతు ఖాతాకు తిరిగి ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ శిబిరంలో దాదాపు 55 గేదెలు, 18 ఆవులకు చికిత్స చేశారు. కృత్రిమ గర్భాధారణ 10, 50 దూడలకు నట్టల నివారణ నివారణ మందును వేశారు. ఈ కార్యక్రమంలో లింగంపేట్ పశువైద్యాధికారిని డాక్టర్ హన జోనస్, డాక్టర్ రవికిరణ్, లింగంపేట వెటర్నరీ అసిస్టెంట్ రవి, లింగంపేట్ సింగిల్ విండో చైర్మన్ దేవేందర్ రెడ్డి, సూపర్వైజర్ కృష్ణ, గోపాలమిత్రలు ఎజాజ్, రమేష్, వెంకట్, మల్లేష్, పశువుల పెంపకం దారులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని వడ్లం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని గురువారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శామప్ప ఈ శిబిరాన్ని ప్రారంభించారు. మండల పశు వైద్యాధికారి డా.మణికుమార్ మాట్లాడుతూ.. పాడి పశువులకు చూడి పరీక్షలు నిర్వహించి, గర్భకోశ వ్యాధులున్న పశువులకు చికిత్సలు నిర్వహించారు. ఎదలో ఉన్న పశువులకు కృత్రిమ గర్భధారణ నిర్వహించారు. దూడలకు నట్టల మందులు, పాడి పశువులకు మినిరల్ మిక్చర్ ప్యాకెట్లు అందజేశారు. శిబిరంలో 33 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 21 సాధారణ చికిత్సలు, 32 పశువులకు నట్టల నివారణ మందులు అందజేశారు. పాడి రైతులకు పాడి పశువుల యాజమాన్య పద్ధతులు, దూడల పోషణ, కృత్రిమ గర్భధారణ ప్రాముఖ్యత, సెక్స్ సార్టెడ్ సెమెన్ (ఖచ్చితంగా ఆడదూడ పుట్టే విధంగా అభివృద్ధి పరిచిన వీర్య నాలికలు) తదితర అంశాలపై రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జైపాల్‌సింగ్, మహేష్ నాయక్, గోపాలమిత్ర సూపర్వైజర్ బస్వరాజ్, గోపాలమిత్ర రవీందర్, గౌస్, రైతులు గోపాల్, రవి, మల్లప్ప, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాలలో కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-ఎడపల్లి

లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ఆధ్వర్యంలో మండలంలోని ధర్మారం, జైతాపూర్, గ్రామ పంచాయతీ కార్యాలయంలో మొబైల్ వ్యాన్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. క్యాంపింగ్ గ్రామానికి చెందిన 65 మందికి కంటి వైద్యులు సతీష్ కుమార్ కంటి పరీక్షలు నిర్వహించారు. 12 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం బోధన్ లయన్స్ కంటి హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జి.ఈ.టి కోఆర్డినేటర్ సూర్యనారాయణ, లయన్స్ క్లబ్ ఎడపల్లి అధ్యక్షులు మనోజ్ కుమార్, కార్యదర్శి రాకేష్‌వర్మ, కోశాధికారి గంగారెడ్డి, పుష్పలత, సీనియర్ లయన్ మెంబర్స్ డిసి మెర్సీ, కదం ప్రకాష్‌రావు సిబ్బంది హన్మాండ్లు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటసాగులో మెలకువలు పాటించాలి



వ్యవసాయ శిక్షణ తరగతిలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-తాడ్వాయి

పంట సాగులో మెలకువలు పాటించాలని వ్యవసాయ శిక్షణ పొందుతున్న విద్యార్థులు అన్నారు. మండలంలోని ఎర్రపాడు గ్రామ శివారులో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మొక్కజొన్న పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న పంట సాగులో అధికారుల సూచనలు సైతం పాటించాలని అన్నారు. రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడితే మొక్క ఏపుగా పెరిగి పంట దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త అనిల్ డా.రేవంత్ విద్యార్థినిలు యశ్విత శాంతి, ప్రణీత రైతులు పాల్గొన్నారు.

47వ వార్డులో సమగ్ర ఇంటింటి సర్వే పూర్తి


సర్వే నిర్వహిస్తున్న అధికారి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 47వ వార్డులో 5 గురు అధికారులు, 5 టీములుగా ఏర్పడి గత 11 రోజుల నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను నిర్వహించి గురువారం నాటికి 100 శాతం పూర్తి చేశారని కౌన్సిలర్ గెరిగంటి స్వప్న లక్ష్మీనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి వెళ్లి సర్వే అధికారులు వారి కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారని, ఈ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నమోదు కార్యక్రమాన్ని సందర్శించి అధికారులు తీసుకుంటున్న వివరాలను పరిశీలించారు. సర్వే అధికారులు వెంకట స్వామి, సతీశ్, సూరజ్, అనురాధ, లలిత తదితరులు సర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారని పేర్కొన్నారు.

సబ్సిడీపై కూరగాయాల విత్తనాలు

నవతెలంగాణ-ఎడపల్లి

బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి ఉద్యానవన శాఖ నుంచి సబ్సిడీపై కూరగాయల విత్తనాలను కూరగాయలు పండించే ఆసక్తి గల రైతులు తీసుకెళ్లాలని ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్ధి రామేశ్వరరావు తెలిపారు. కూరగాయ విత్తనాలు ఫండల్స్, డ్రిప్పు మల్చింగ్, టమాట, బెండకాయ, బీరకాయ, సొరకాయ, చిక్కుడుకాయ, బెండ, టమాట విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. మండలంలోని ఆసక్తిగల రైతులు ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ విస్తీర్ణ అధికారులు జ్యోతి, హరీష్ వద్ద తమ పేర్లను రెండు రోజుల్లోగా నమోదు చేయించుకోవాలని ఆయన రైతులను కోరారు.

మహాలక్ష్మి మందిరంలో పూజలు


మహాలక్ష్మి మందిరంలో పూజలు చేస్తున్న పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని జైతాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మహాలక్ష్మి దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎడపల్లి మండల బీజేపీ సీనియర్ నాయకులు కందగట్ల రామచందర్ (అన్నాసేట్) జిల్లా కార్యవర్గ సభ్యులు కరుటూరి సూర్యనారాయణ, మల్లెపూల శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట ఎడపల్లి మండల ఉపాధ్యక్షులు నాయిని లక్ష్మణ్ గౌడ్, శివ చైతన్య, నాయకులు ప్యాట గంగాధర్, కంజరి ప్రదీప్, బర్దీపూర్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రీ కాలబైరవ స్వామి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఇసన్నపల్లి(రామారెడ్డి)లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి జన్మదిన వేడుకల్లో భాగంగా గురువారం బద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలతో నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను చేసింది. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రభు, అర్చకులు శ్రీనివాస్ శర్మ, వంశీకృష్ణ శర్మ జూనియర్ అసిస్టెంట్ సిహెచ్ లక్ష్మణ్, సిబ్బంది నాగరాజు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఎస్‌డిఎఫ్ నిధులు మంజూరు

- నాగిరెడ్డిపేట్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్ గౌడ్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండలానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావు ఎస్‌డిఎఫ్ నిధుల కింద రూ.11.50 లక్షలు మంజూరు చేసినట్లు నాగిరెడ్డిపేట్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు శ్రీధర్ గౌడ్ గురువారం తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫర్నీచర్ కోసం ఎనిమిది లక్షలు, అదేవిధంగా గోపాల్‌పేట్ మసీదు కోసం మూడున్నర లక్షలు మంజూరు చేసినట్లు ఆయన వివరించారు. ప్రొసీడింగ్ వచ్చాయని, పనులను వెంటనే ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. నాగిరెడ్డిపేట్ మండలానికి నిధులు మంజూరు చేసినందుకు గానూ శ్రీధర్‌గౌడ్ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సన్మానం


కమిటీని సన్మానించిన పలువురు

నవతెలంగాణ-పిట్లం

మండల మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్, వైస్‌చైర్మన్ మారెడ్డి కృష్ణారెడ్డి, పాలకవర్గ సభ్యులకు మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ నూతన చైర్మన్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధిలో భాగంగా మెడికల్ అసోసియేషన్ వారి అభివృద్ధికి తోడ్పాటు నందిస్తూ, వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మెడికల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రాజు, సెక్రటరీ భద్రయ్య, కార్యవర్గ సభ్యులు బలరాంరెడ్డి, ఖలీమ్, ప్రభాకర్ రెడ్డి, అంజయ్య, గొల్ల సాయిలు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి తెలిపారు. గురువారం బాన్సువాడ పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలలను సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను, మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజనం శుభ్రతతో వడ్డించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆమె వెంట ఎంఈవో నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

చెకుముకి పోటీ పరీక్షల నిర్వహణ

నవతెలంగాణ-నిజాంసాగర్

ఉమ్మడి మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సమగ్ర శిక్ష తెలంగాణ ప్రభుత్వం సహకారంతో మండల కేంద్రంలో చెకుముకి పరీక్షలు గురువారం నిర్వహించినట్టు ఉమ్మడి మండల విద్యాధికారులు తిరుపతిరెడ్డి, అమర్ సింగ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెకుముకి సైన్స్ ఛాలెంజ్ టెస్ట్ అనేది విద్యార్థుల సైన్స్‌పై అవగాహన, వారి ఆచరణాత్మక శాస్త్రీయ పరిజ్ఞానాన్ని సవాల్ చేసే పోటీ అని విద్యార్థులలో మూఢనమ్మకాలకు ఎలాంటి తావులేకుండా చేసే పోటీ అని వారు అన్నారు.

దీనికిగాను ఉమ్మడి మండల స్థాయిలోని ప్రభుత్వ పాఠశాల అన్నింటి నుంచి విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. తెలుగు మీడియం స్థాయిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మల్లూరు విద్యార్థులు ప్రథమ స్థానంలో వచ్చారని, ఇంగ్లీష్ మీడియంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిజాంసాగర్ విద్యార్థులు ప్రథమ స్థానంలో వచ్చిందని వివరించారు. గురుకులాలకు సంబంధించి కేజీబీవీ పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో వచ్చిందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉమ్మడి మండల విద్యాశాఖ అధికారులు తిరుపతిరెడ్డి, అమర్‌సింగ్ పార్టిసిపేట్ సర్టిఫికెట్లు అందించినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను అందుకున్న విద్యార్థులు

పల్లికొండపై పోలీసులకు ఫిర్యాదు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు పల్లికొండ సాయిబాబాపై నసురుల్లాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మత్స్య సహకార సంఘం సభ్యులు ఫిర్యాదు చేశారు. నసురుల్లాబాద్ మండలంలోని మైలారం మత్స్య పారిశ్రామిక సహకారం సంఘంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని సంఘం సభ్యులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత పది సంవత్సరాల క్రితం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పల్లికొండ సాయిబాబా అనే వ్యక్తి మైలారం మత్స్య సహకార సంఘంలో సభ్యుడిగా ఉంటూ అధ్యక్షుడిగా పనిచేశారని, పదవీకాలం ముగించినప్పటికీ సొసైటీకి సంబంధించిన రికార్డులను తన వద్ద ఉంచుకొని సొసైటీకి రావలసిన నిధులను పక్కదారి పట్టించారని తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్న పల్లికొండ సాయిబాబా మత్స్యకారులకు రావాల్సిన ఆదాయాన్ని గండికొట్టారని వివరించారు. సంఘం సభ్యులకు తెలియకుండానే ఫోర్జరీ సంతకాలు చేసి బొలెరో వాహనం, మోపెడ్లు తీసుకున్నారన్నారని, ఎలాంటి తీర్మానం లేకుండానే చైర్మెన్‌గా కొనసాగుతున్నారని అన్నారు.

సొసైటీ రికార్డులు అడిగితే తమను బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సొసైటీకి సంబంధించిన రికార్డులను ఇవ్వకుండా సొసైటీ డైరెక్టర్‌ను బెదిరిస్తున్న పల్లికొండ సాయిబాబాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని మత్స్యకారులు కోరారు. మత్స్యకారులు ఇచ్చిన ఫిర్యాదు మెరుగు విచారణ జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.


ఫిర్యాదు చేస్తున్న మత్స్య సహకార సంఘం సభ్యులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శుక్రవారం నవంబర్ 22, 2024 www.navatelangana.com

మెనూ ప్రకారం భోజనం అందించాలి

• ఎంఈఓ బట్టు రాజేశ్వర్

నవతెలంగాణ-బాల్కొండ

తెలంగాణ మోడల్ స్కూల్ పాఠశాలను గురువారం మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ కి సూచించారు. తెలంగాణ మోడల్ స్కూల్ లో లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం, ఉపాధ్యాయుల బోధన తీరును ఆన్లైన్లో నమోదు చేసినట్టు తెలిపారు. నాస్ పరీక్ష పేపర్లను పరిశీలించారు. నాస్ పరీక్షకు 6వ, 9వ తరగతి విద్యార్థులను సిద్ధం చేయాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-బాల్కొండ



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను మండల పరిధిలోని కిసాన్‌నగర్‌లో కాంగ్రెస్ నాయకులు గురువారం లబ్ధిదారులు అమర్నాథ్ గౌడ్, రంగరి గౌరబాయికు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జి సునీల్ రెడ్డి ప్రత్యేక చొరవతో చెక్కులు మంజూరు చేయించినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కనికారపు గంగాధర్, సీనియర్ నాయకులు చాట్ల నరేష్, చేని నగేష్, లక్ష్మి నారాయణ, జక్క రాజలింగం, అక్బర్, పురుషోత్తం, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి

• సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్

నవతెలంగాణ-ఆర్మూర్ (వేల్పూర్)

మండలంలోని పచ్చల నడుకుడ గ్రామంలో సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి గురువారం సమగ్ర కుటుంబ సర్వేలో గురువారం పాల్గొన్నారు. జరిగినది . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్యకర్తలకు అధికారులకు సహకరించాలని అన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు కలిగిన చోటుకు వెళ్లి సర్వేకు వచ్చిన వారికి సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ మల్లేష్, టక్కరి గంగాధర్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కంఠేశ్వర్

భార్యాపిల్లలు తనను వదిలి వెళ్లిపోవడం, ఎనిమిది నెలల క్రితం తండ్రి చనిపోవడంతో మానసికంగా కృంగిపోయిన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నగరంలోని పోచమ్మగల్లీ, ముదిరాజ్ వీధిలో చోటు చేసుకుంది. నరేశ్(40)ను కుటుంబ కారణాలతో భార్యాపిల్లలు వదిలి వెళ్లిపోయారు. ఆ తరువాత తండ్రి చనిపోయాడు. దీంతో నరేశ్ మానసికంగా కృంగిపోయి తన ఇంట్లో బుధవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

మహాలక్ష్మి నగర్‌లో చోరీ

• బంగారం, నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని నాలుగవ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి దొంగలు హల్చల్ చేశారు. నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాలక్ష్మి నగర్లో ఓ ఇంట్లో చోరీ చేశారు. ఈ,74తాళం వేసి ఉండడాన్ని గమనించిన దొంగలు లోనికి చొరబడి ఐదున్నర తులాల బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కాగా దొంగలు కాలనీలో తిరుగుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి.

యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయాలి : పీడీఎస్‌యు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని పిడిఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ కోరారు. తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరిరావుకు టీయూ పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం వందల సంఖ్యలో తెలంగాణ యూనివర్సిటీలో సీట్లు ఖాళీగా మిగిలిపోతున్నాయని అన్నారు. పేద విద్యార్థులు యూనివర్సిటీ విద్యకు దూరమవుతున్నారని, పీజీ కళాశాలలకు స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా ఖాళీలను భర్తీ చేసుకోవడానికి అవకాశం ఇస్తున్నారని ,కానీ యూనివర్సిటీలో కొన్ని సంవత్సరాలుగా ఖాళీ సీట్లను భర్తీ చేయడం లేదని తెలిపారు. ఈసారైనా ఖాళీగా ఉన్న ఇంటిగ్రేటెడ్ కోర్సులు, పీజీ, ఎల్ఎల్‌బి, బిఎడ్ సీట్లను స్పాట్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేసి గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యకమంలో పిడిఎస్‌యూ యూనివర్సిటీ నాయకులు ప్రిన్స్, రవీందర్, రాకేష్, బాలాజీ, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణకు ప్రత్యేక చర్యలు

• డివిజనల్ ఫారెస్ట్ అధికారి భవాని శంకర్

నవతెలంగాణ -ఆర్మూర్



అటవీ సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డివిజనల్ ఫారెస్ట్ అధికారి భవాని శంకర్ గురువారం తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో మొక్కలను నాటాలని కోరారు. అటవీ శాఖతో ప్రజలను మమేకం చేసేందుకు పట్టణ ప్రాంతాల శివారులో అర్బన్ పార్కులు సైతం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నిజామాబాద్, ఆర్మూర్ ప్రాంత ప్రజలు సెలవుల్లో కుటుంబాలతో తమ చిన్నారులతో గడపడానికి 63వ జాతీయ రహదారిపై అరణ్య అర్బన్ పార్క్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇది మాక్లూరు మండలంలోని చిన్నాపూర్, మామిడిపల్లి గ్రామాల సరిహద్దులోగల అటవీశాఖ భూమిలో సుమారు 400 ఎకరాలు, ఐదు కిలోమీటర్ల పొడవుగల విస్తీర్ణంతో పార్కు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కిందిస్థాయి సిబ్బందితో అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ పార్టీపై నిందలు వేయడం సరికాదు



మాట్లాడుతున్న మండలాధ్యక్షులు పూర్ణానందం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తాళ్ళ రాంపూర్ గ్రామంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పూర్ణానందం సమావేశాన్ని నిర్వహించారు. గతంలో ఐదు నుండి ఆరు కిలోల కద్దా తీసుకునేవారని తాళ్ళరాంపూర్ వద్ద కొనుగోలు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాష్ట్ర కిసాన్ ఖేత్ అధ్యక్షులు అన్వేష్ రెడ్డి మాట్లాడడాన్ని మండల బీఆర్ఎస్ పార్టీ తరపున ఖండిస్తున్నామని అన్నారు. రైతులకు క్వింటాలు వరికి 500 రూపాయలు బోనస్ ఇవ్వకపోగా, బీఆర్ఎస్ పార్టీపై నిందలు వేయడం సరికాదని తెలిపారు. సన్న వరితో పాటు దొడ్డు వరిని కొని రైతులకు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు బోనగిరి రమేష్, అశోక్ యాదవ్, నెరేళ్ళ దేవన్న, గంగాధర్, అడెల్లి , తదితరులు పాల్గొన్నారు.

సింగిల్ విండో చైర్మన్‌కు పరామర్శ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని అర్గుల్ సొసైటీ చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి తండ్రి మరణించిన విషయం తెలుసుకుని నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఐడీసీ ఎంఎస్ చైర్మన్ బాదవత్ తారచంద్ నాయక్ గురువారం పరామర్శించారు. ఆయన వెంట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సొప్పరి వినోద్, మాజీ సర్పంచ్ కాటుపల్లి నర్సారెడ్డి, మాజీ ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జితేందర్ నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జైడీ మల్లేష్, సురేష్ , జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మంత్య నాయక్ , మాజీ సర్పంచ్ సుభాష్ ,ధర్పల్లి మండల ఏబిఎస్ఎస్ అధ్యక్షులు లాల్ సింగ్, ఇందిరానగర్ తాండా పార్టీ ప్రెసిడెంట్ రాయల్ ఉన్నారు.

జోనల్ క్రీడల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఆర్మూర్ : ఈనెల 11 నుండి 14 వరకు నాలుగు రోజుల నుండి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ నిర్వహించిన బాసర జోన్ 10వ జోన్ల స్పోర్ట్స్ మీట్ ముధోల్ వేదికగా జరిగిన ఆటల్లో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు పలు కేటగిరీల్లో ప్రతిభను కనబరిచి అత్యధికంగా బహుమతులు గెలుపొందినట్టు గురుకుల ప్రిన్సిపల్ పూర్ణచందర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్ 14 విభాగంలో ద్వితీయ స్థానంలో చెస్, కబడ్డీ, ఖోఖో, టెన్నికైట్, టీం ఛాంపియన్‌గా నిలిచిందన్నారు. క్యాప్టెన్‌గా మహానంద్, విగ్నేష్ నేతృత్వంలో అండర్ 14 విభాగంలో ఓవరాల్ ఛాంపియన్షిప్‌గా గురుకుల విద్యార్థులు నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ అభినందించారు. ఈ విజయానికి కృషిచేసిన వైస్ ప్రిన్సిపల్ సాయన్న, దయల్, చక్రపాణి, గంగాధర్, ప్రేమ్, సంధ్యారాణి, రవి, గణేష్, రాజేశ్వర్, వ్యాయామ ఉపాధ్యాయులు పిడి జ్ఞానేశ్వర్, పిఈటి రాజేందర్, నరేష్, పాఠశాల, కళాశాల బృందం, నాన్ టీచింగ్ స్టాఫ్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.



ఆర్మూర్ : జోన్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ కనబరిచిన సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు

జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక

ఆర్మూర్ : ఆలూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి చెకుముకి సైన్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కల్లెడ విద్యార్థులు సంజన, అఖిల, గోపీచంద్ ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. మండల విద్యాధికారి నరేందర్ విద్యార్థులను అభినందించినారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ టోర్నీకి మిట్టాపల్లి విద్యార్థులు

డిచ్‌పల్లి: ఈ నెల 23 నుంచి 25 వరకు వరంగల్ జిల్లాలో జరిగే అండర్-17 నెట్బాల్ రాష్ట్రస్థాయి టోర్నీకి మిట్టాపల్లి విద్యార్థులు మేఘన, తరుణ్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సుశీల్‌కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి టోర్నీలో మంచి ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీ గంగాధర్, ఉపాధ్యాయులు ఉన్నారు.



డిచ్‌పల్లి : నెట్‌బాల్ టోర్నీకి ఎంపికైన విద్యార్థులు

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

కమ్మర్‌పల్లి: మండలంలోని కోన సముందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతికి చెందిన విస్లవత్ సంధ్య రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బి.మధుపాల్ తెలిపారు. తిరుమనపల్లిలో జరిగిన టోర్నమెంట్‌లో అత్యంత ప్రతిభ కనపరిచి విస్లవత్ సంధ్య రాష్ట్ర స్థాయికి నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 23,24,25 తేదీల్లో మహబూబాబాద్ జిల్లా కేసముందర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీల్లో విద్యార్థిని సంధ్య పాల్గొంటుందని ఆయన వివరించారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన సంధ్యను ప్రధానోపాధ్యాయులు బి. మధుపాల్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు కంతి సాయన్న, పోతన్నంక రాజ గంగారం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు నస్రిన్ బేగం అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ బి. రమేష్ గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుల గణన జరిగితేనే మన హక్కులు మనకు

• బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

బీసీ కుల గణన జరిగితేనే మన హక్కులు మనకు చెందుతాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం నిజామాబాద్ నగరం లోని మేరు భవన్‌లో జరిగిన బీసీ కులగణనపై బీసీ సదస్సులో పాల్గొని ప్రసంగించారు. బీసీ బిడ్డ మహేష్ కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్షులు కావడంతోనే తెలంగాణ రాష్ట్రంలో బీసీ కుల గణన సాధ్యం అయ్యిందన్నారు. దాదాపు 100 ఏళ్ల తర్వాత మన బీసీ కుల గణన జరుగుతుందని, మనమెంతో మనకంత రిజర్వేషన్లు రావాలంటే ఈ కులగణన జరగాల్సిందేనని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సోదరులకు బాబా సాహెబ్ అంబేద్కర్ వల్ల వారెంతో వారికి అంత రిజర్వేషన్లు వచ్చాయన్నారు. కాని పట్టుమని 8శాతం కూడ లేని అగ్రవర్ణాలు 10శాతం ఈడబ్ల్యూఎస్ పేరుతో రిజర్వేషన్లు సాధించారని తెలిపారు. బీసీలకు రాజ్యాంగబద్ధ అధికారాలు లేవని, రాజకీయ అధికారాల అండదండలు లేవు కాబట్టే అన్యాయం జరుగుతుందని అన్నారు. ఎప్పుడో వంద ఏండ్ల కిందట 1931లో బ్రిటీష్ వారు చేసిన కులగణనలో మనం 54శాతం ఉన్నామని తెలిసిందని, అప్పుడు కేవలం 30, 40 కులాలే మన బీసీల లిస్టులో ఉండేవని, ఇప్పుడు దాదాపు 130 కులాలు ఉన్నాయని తెలిపారు. దాదాపు 60శాతం ఉంటామని, మనమెంతో మనకు అంత వాటా దక్కాల్సిందేనని అన్నారు. బీసీ కులగణన జరిగితేనే రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత వస్తదని అన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్, ఉద్యోగ సంఘం నాయకులు చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్, బుస్స ఆంజనేయులు, ఆకుల ప్రసాద్, కరిపే రవిందర్, ధర్మనం దేవేందర్, పోల్కం గంగాకిషన్, కొయ్యాడ శంకర్, శ్రీలత, నారాయణ రెడ్డి,సత్యప్రకాశ్, భూమన్న, పూల్లం హన్మాండ్లు, శ్రీనివాస్, లక్ష్మణా చారి, హనుమంత్ రావు, గంగాధర్, సాయిలు, భిక్షపతి, కోడూరి స్వామి, నగేష్, సుధర్శన్, బాలన్న పాల్గొన్నారు

తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-మోపాల్

విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు ప్రజలకు అందించాలని ధర్మ సమాజ్ పార్టీ నిజామాబాద్ జిల్లా మండల కమిటీ ఆధ్వర్యంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ రావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. పేద ప్రజలైన బీసీ ఎస్సీ ఎస్టీ ఈబీసీలు కట్టే పన్నులతో ఈ ప్రభుత్వాలు నడుస్తున్నాయన్నారు. ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య, ఆత్యాధునికమైన వసతులతో మంచి వైద్యం, పనికి తగిన వేతనంతో ఉపాధి, నివసించడానికి నాలుగు గదుల ఇల్లు, చేసుకోవడానికి అర్హులైన వారికి సాగునీటితో కూడిన ఎకరం భూమి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనా కార్యక్రమాలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు మరియు రూరల్ నియోజకవర్గ ఇన్చార్జి ప్రశాంత్, మండల నాయకులు ప్రశాంత్, మహేష్, గంగాధర్, అజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులందరూ సంఘటితం కావాలి

టీఎన్జీవో

నవతెలంగాణ-ముప్కాల్



మాట్లాడుతున్న సుమన్‌కుమార్

ఉద్యోగులందరూ సంఘటితం కావాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ అన్నారు. ఎస్సారెస్పీ టీఎన్జీవో యూనిట్ ఆధ్వర్యంలో గురువారం ముప్కాల్ రైతువేదికలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నూతన జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ హాజరై ప్రసంగించారు. యూనిట్ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. టీఎన్జీవో జిల్లా కార్యాలయంలో 'గ్రీవెన్స్ సెల్' ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సమస్యలు ఏమైనా ఉంటే విడతలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగుల హక్కుల సాధన కొరకై కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం సభ్యత్వ నమోదు చేపట్టారు.టీఎన్జీవో నూతన జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన సుమన్ కుమార్, జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్ లను ఎస్సారెస్పీ యూనిట్ పక్షాన, వివిధ శాఖల పక్షాన శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీఎన్జీవో కేంద్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు జాకీర్ హుస్సేన్, జాఫర్ హుస్సేన్, ఉమా కిరణ్, మాణిక్యం, నిరంజన్ గౌడ్, యూనిట్ మాజీ అధ్యక్షులు జాన్ సుభాకర్, టీఎన్జీవో ముఖ్య సలహాదారులు, వనమాల సుధాకర్, టీఎన్జీవో ఆర్మూర్ యూనిట్ పక్షాన శశికాంత్ రెడ్డి, వెటర్నరీ శాఖ నుండి గంగారాజు, వివిధ శాఖల నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.

చలో పార్లమెంట్ పోస్టర్ల ఆవిష్కరణ-ఏఐపిఎస్‌యు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపిఎస్‌యు) ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ వద్ద చలో పార్లమెంట్ పోస్టర్ల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐపిఎస్‌యు జిల్లా కార్యదర్శి బోడ.అనిల్ మాట్లాడుతూ.. విద్య, ఉపాధి, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ పరం చేయడం మానుకోవాలని అన్నారు. ప్రభుత్వ విద్య రంగాన్ని కాపాడుకోవాలంటే కొఠారి కమిషన్ ప్రకారం మొత్తం కేంద్ర బడ్జెట్లో విద్య రంగానికి 10 శాతం నిధులు కేటాయించాలని, కానీ ఏటా 2-3శాతం కంటే ఎక్కువ కేటాయించడం లేదని అన్నారు. కార్పొరేట్ వ్యక్తులకు విద్యారంగాన్ని ధారా దత్తం చేసేందుకే నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చారని తెలిపారు. వెంటనే నూతన జాతీయ విద్యా విధానం 2020 ను రద్దు చేయాలని అన్నారు. చరిత్రను వక్రీకరిస్తూ చేస్తున్న ఎన్సీఈఆర్ సిలబస్ మార్పులను ఆపాలని తెలిపారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపతి ని కాపాడాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ పరిశోధక విద్యార్థుల ఫెలోషిప్‌లో కోతలు విరమించుకోవాలని తెలిపారు. ఈనెల 28న తలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కే. సందీప్, జిల్లా నాయకులు గోపాల్ సింగ్ ఠాకూర్, అరవింద్, నరేష్, సునిల్, గణేష్ శివ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు సంతాన సాఫల్య ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-బాల్కొండ



మండల కేంద్రంలోని నరేందర్ మెడికల్ వారి ఆధ్వర్యంలో ఈనెల 23న సంతాన సాఫల్య ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గురువారం తెలిపారు. ఈ శిబిరానికి ఇన్ ఫెర్టిలిటీ సంతానోత్పత్తి స్పెషలిస్ట్ వైద్యురాలు అధుముల్లా శృతి సిందునూరి హైదరాబాద్ వారితో చికిత్స చేయనున్నట్టు చెప్పారు. ముందస్తు బుకింగ్ చేసుకోవడానికి నెంబర్లకు సంప్రదించాలని కోరారు. చికిత్స కోసం వచ్చే దంపతులు వారి పాత రిపోర్టులు వెంట తీసుకునిరావాలని సూచించారు.

హామీలను అమలుచేయాలి

• జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు • సమ్మె నోటీస్ అందజేత



సమ్మెనోటీసు అందజేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ప్రస్తుత ముఖ్యమంత్రి, అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగులు కోరారు. కలెక్టరేట్ ఏఓ, జిల్లా విద్యాధికారికి సమ్మె నోటీస్ గురువారం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 15 రోజుల్లో ప్రభుత్వం చర్చలకు పిలిచి హామీలు నెరవేర్చాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షలోని అన్ని విభాగాలు నిరవధిక సమ్మె చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కే రాజు, గౌరవాధ్యక్షులు అశ్రఫ్ అలీ, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కే.భూపేందర్, జిల్లా కోశాధికారి ప్రసాద్, ఎంఐఎస్ కోఆర్డినేటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రాజు, సీఆర్‌పి అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అంబదాసరావు, కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పవిత్రన్, పిటిఐల సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్, డిపిఓ స్టాఫ్ పుష్ప, రవి జాన్, సత్యపాల్, బోధన్ డివిజన్ అధ్యక్షులు యూసుఫ్‌అలీ, సాంస్కృతిక కార్యదర్శి బాబు, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22 శుక్రవారం నుండి ప్రారంభం కానున్న శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని అ సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెల్ ఫోన్ రిపేర్, హౌజ్ వైరింగ్, సీ సీ టివి ఇన్‌స్టాలేషన్‌పై శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు 19 నుండి 45 సంవత్సరాల వయస్సు ఉండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రాంత యువకులు అర్హులని తెలిపారు. శిక్షణ కు వచ్చే ముందు తమ వెంట ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డు , రేషన్ కార్డ్, పదోతరగతి మెమో జిరక్స్, ఐదు ఫోటోలు తీసుకొని వచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. శిక్షణా సమయంలో భోజనం, హాస్టల్ వసతి ఉంటుందని, శిక్షణా అనంతరం ధృవీకరణ పత్రం, టూల్ కిట్ కూడా ఉచితంగా అందచేస్తున్నట్లు పేర్కొన్నారు. టిటి డిసి క్యాంపస్, డిచ్ పల్లి ఘన్‌పూర్‌లో ఫోన్ నెంబర్. 08461-295428కు సంప్రదించాలని తెలిపారు.

మాలల సింహ గర్జనకు తరలిరావాలి

వర్గీకరణ పేరుతో జాతిని విడగొడుతున్నారు

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మాట్లాడుతున్న నీరడి లక్ష్మణ్

డిసెంబర్ 1న చలో హైదరాబాద్‌కు సింహ గర్జన కార్యక్రమానికి మాలలందరూ తరలిరావాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కో కన్వీనర్ నీరడి లక్ష్మణ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మాల సంఘంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీరడి లక్ష్మణ్ మాట్లాడుతూ డిసెంబర్ 1న హైదరాబాద్ ఫెయిల్యూర్ గ్రౌండ్‌లో నిర్వహించే మాల సింహగర్జన కార్యక్రమానికి ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, మేధావులు, న్యాయవాదులు, డాక్టర్లు, ఇంజనీర్లు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కొంతమంది మను వాదులు వర్గీకరణ పేరుతో జాతిని విడగొడుతున్నారని అన్నారు. మాల మాదిగలు కలిసి ఉంటే రాజ్యం వస్తుందని అన్నారు. ఆనాడు డాక్టర్ అంబేద్కర్ రాజ్యాధికారమే అంతిమ లక్ష్యమని అన్నారని ఆయన గుర్తు చేశారు. ఎస్సీ కులాల మధ్య మధ్య చిచ్చు పెడుతూ రాజ్యాధికారం రాకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా మాల, మాదిగలు కలిసి ఉంటే రాజ్యాధికారం మనదేనని అన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకుందాం రిజర్వేషన్లను కాపాడుకుందాం అని అన్నారు. డిసెంబర్ 1న జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరు హాజరై ప్రభుత్వానికి మాలల సింహ గర్జన తెలియజేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కో కన్వీనర్లు కేశ్ పల్లి రవి, సిద్ధం రాజేందర్, జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు విజయ్ కుమార్, మాల మహానాడు నాయకులు, మాల సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

24వ వార్డులోని సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని 24వ వార్డులో సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరారు. అవసరమైన చోట్ల రోడ్లకు మరమ్మత్తులు చేయించాలన్నారు. ఈ సందర్భంగా సిపిఐ డివిజన్ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు మాట్లాడుతూ.. కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి నరేష్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఎమ్మెల్యే భరోసా



చెక్కులను పంపిణీ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

పేద ప్రజలకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు భరోసానిస్తున్నాడని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు బుర్ర నారా గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని ముస్తాపూర్, బానాపూర్, కోర్పోల్, నల్లమడుగు, ఐలాపూర్ గ్రామాలలో ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదేశానుసారం 9 మంది బాధితులకు ఇంటింటికి వెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో యూత్ మండలాధ్యక్షులు రాజు, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ నగేష్, మండల సమన్వాయ కమిటీ సభ్యులు వంజరి ఎల్లమయ్య, సాయికుమార్, సిద్ధు కాంతం, అశోక్, నాయకులు బైరయ్య, కుమ్మరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గర్భకోశ చికిత్స శిబిరం



పశువులకు చికిత్స నిర్వహిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని ముదేల్లి గ్రామంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి రవి మాట్లాడుతూ.. పశుగణనాభివృద్ధి సంస్థ వారు ఉచితంగా మందులు పంపిణీ చేశారని, శిబిరంలో 20 పశువులకు గర్భకోశ వ్యాధులకు రెండు కృత్రిమ గర్భధారణ, 4 సాధారణ చికిత్స 20 నట్టల మందును, మొత్తం 46 పశువులకు ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. రైతులకు ఎటువంటి ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు సురేష్, సూపర్‌వైజర్ తిరుపతి, గోపాలమిత్రలు ప్రసాద్, రాములు, రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తారు రోడ్డు.. మట్టిమయం

- దుమ్ము ధూళితో శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్న ప్రజలు
- కన్నెత్తి చూడని అధికారులు



బస్సు వెళ్లిన తర్వాత ఎగిసిపడుతున్న దుమ్ము, ధూళి

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని మాగి గేటు నుంచి అన్నారం గేట్ వరకు గల ఆర్అండ్‌బీ రోడ్డు మొత్తం మట్టిమయమైంది. దీనివల్ల వడ్డేపల్లి, మల్లూరు, అన్నారం గ్రామ ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. మూడు సంవత్సరాల క్రితం నాగమడుగు ఎత్తిపోతల పథకం మంజూరైన సందర్భంగా భారీ వాహనాలు ఈ రోడ్ల వెంబడి వెళ్లి రోడ్లన్నీ పాడైపోయాయి. ఆ ప్రాజెక్ట్ కాంట్రాక్టు తీసుకున్న మెగా కంపెనీకి చెందిన వాహనాలు తిరిగినప్పుడు వాటర్ ట్యాంకర్‌తో వాటర్ క్యూరింగ్ చేశారు. సంవత్సరం కింద ప్రభుత్వం మారగానే ఆ నాగమడుగు పనులు ఆగిపోయాయి. ఈ విషయంపై ఆయా గ్రామాలలోని ప్రజలు గ్రామపంచాయతీ సంబంధించిన అధికారులకు వినతిపత్రం ఇవ్వగా చేసేది మా చేతిలో ఏమీ లేదని వాళ్లు అంటున్నారని తెలిపారు. వెంటనే సదరు అధికారులు స్పందించి వాటర్ క్యూరింగ్ లేదా కొత్త రోడ్లను నాణ్యతగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డబ్బుల చెల్లింపులో మొదటిస్థానం

- వడ్ల కొనుగోలులో రెండో స్థానం
- డీఎంసిఎస్ జిల్లా అధికారి రాజేందర్



నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్రంలో ధాన్యం డబ్బుల చెల్లింపులో కామారెడ్డి జిల్లా మొదటిస్థానంలో ఉందని డిఎంసిఎస్ జిల్లా అధికారి రాజేందర్ తెలిపారు. గురువారం ఆయన నవతెలంగాణతో ప్రత్యేకంగా మాట్లాడారు. వడ్ల కొనుగోలులో రెండో స్థానంలో ఉందని వివరించారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు గానూ దొడ్డు, సన్నరకాల ధాన్యం కలిపి ఇప్పటివరకు 2,56,278,800 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 423 వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, అందులో 63 సెంటర్‌లలో ప్రత్యేకంగా సన్న వడ్లను కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. 350 సెంటర్లలో సన్నవి, దొడ్డువి కలిపి కొనుగోలు చేస్తున్నట్టు వివరించారు. ఈనెల 19 వరకు 1,94,577,160 మెట్రిక్ టన్నుల దొడ్డు వడ్లను కొనుగోలు చేసినట్టు, 61,701,640 మెట్రిక్ టన్నుల సన్నం వడ్లను కొనుగోలు చేశామని తెలిపారు.

రైతుల అకౌంట్లో డబ్బులు వేయడంలో మొదటి స్థానం..

జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు రైతుల అకౌంట్లో రూ.40 కోట్ల డబ్బులను వేస్తున్నట్టు వివరించారు. ఈ ఖరీఫ్ పంటకు గానూ ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు సన్నం వడ్లను అమ్మిన రైతులలో 4401 రైతుల అకౌంట్లో బోనస్ డబ్బులు రూ.14 కోట్ల 93 లక్షల జమ చేసినట్టు వివరించారు. వడ్లను కొనుగోలు చేసిన రెండు, మూడు రోజులలో రైతుల ఖాతాల్లోకి డబ్బులు వేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారని ఆయన పేర్కొన్నారు.

మార్కెట్ యార్డు టెండర్ల ప్రక్రియ కుదింపు

- నూతన మార్కెట్ కమిటీ తీర్మానం

నవతెలంగాణ-పిట్లం

మార్కెట్ యార్డ్ పరిధిలోగల పలు వ్యాపార సముదాయాల టెండర్ల ప్రక్రియను నూతన పాలకవర్గం కుదించింది. గురువారం మార్కెట్ కమిటీ చైర్మన్ చికోటి మనోజ్ కుమార్ అధ్యక్షతన నూతన పాలకవర్గ కమిటీ తొలి సాధారణ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ పరిధిలో గల పలు వ్యాపార సముదాయాల టెండర్ల ప్రక్రియను గత ప్రభుత్వం 50 వేల రూపాయలను నిర్ణయించగా వ్యాపారస్తులు ఎవరు ముందుకు రాకపోవడంతో ప్రస్తుత కాంగ్రెస్ గవర్నమెంట్‌లో ఏర్పడిన నూతన పాలకవర్గ చైర్మన్ సభ్యులతో సమావేశంలో చర్చించి 25 వేల రూపాయలుగా టెండర్ ప్రక్రియను కుదించి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని పాలకవర్గ కమిటీ సభ్యులు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మారెడ్డి కృష్ణారెడ్డి, పాలకవర్గ సభ్యులు, సెక్రటరీ శ్రీకాంత్ పాల్గొన్నారు.

యువకుడిపై ఫోక్సో కేసు నమోదు

నవతెలంగాణ-దోమకొండ

యువకుడిపై ఫోక్సో కేసు నమోదైంది. ఈ ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలికకు బీబీపేట మండలంలోని జనగామ గ్రామానికి చెందిన పాత మహిపాల్ అనే యువకుడు మాయమాటలు చెప్పి కొద్దిరోజుల క్రితం లైంగికదాడికి పాల్పడి గర్భవతిని చేశాడు. ఈ విషయంపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు యువకుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

26న దేశవ్యాప్త ఉద్యమం

- విజయవంతం చేయాలి
- సంయుక్త కిసాన్ నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

26న దేశవ్యాప్త ఉద్యమాన్ని విజయవంతం చేయాలని ఎస్‌కెఎం నాయకులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) సెంట్రల్ ట్రేడ్ యూనియన్ సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పజెపే కుట్రలకు వ్యతిరేకంగా కార్మికుల చట్టాలను రద్దుచేసి, నాలుగు కోడులుగా ప్రవేశపెట్టి, పని గంటలు పెంచే కుట్రలకు వ్యతిరేకంగా నవంబర్ 26 దేశవ్యాప్త ఉద్యమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సంయుక్త కిసాన్ నాయకులు, జబ్బర్ నాయక్, మోతీరాం, దేవి సింగ్, తదితరులు పాల్గొన్నారు.

హక్కులతో పాటు బాధ్యతలూ ముఖ్యమే

మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజనర్సు

నవతెలంగాణ-కామారెడ్డి

మన హక్కులతో పాటు బాధ్యతలూ ముఖ్యమేనని మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజనర్సు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో ఆయన మాట్లాడారు. కార్మికులు ఆబ్సెంట్ లేకుండా రోజు విధులకు రావాలని, విధులకు రావడం వలన ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని ఇచ్చిన వాళ్లమవుతామని తెలిపారు. కార్మికులు డ్యూటీకి రాకపోవడం వలన ప్రజా ఆరోగ్యం కుంటుపడుతుందని అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియా మనకోసం జీతాలు ప్రతినెల వచ్చే విధంగా అలాగే ఏరియాస్, పెండింగ్ పీఎఫ్ డబ్బులు త్వరలోనే అందరికీ అకౌంట్లో జమ చేస్తామని తెలిపారని వివరించారు.

కంది, శనగ, జొన్న, పంటల పరిశీలన

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని నాగల్‌గావ్ గ్రామంలో క్షేత్ర స్థాయిలో శనగ, కంది, జొన్న పంటలను వ్యవసాయ విస్తరణ అధికారి సతీష్ చిద్రావర్ గురువారం పరిశీలించారు. రైతులకు సలహాలు, సూచనలు అందించారు. కంది పంటలో ఆకుముడతను గమనించారు. శెనగ పంటలో ప్రధానంగా ఎండు తెగులు గమనించామని తెలిపారు. ఈ సందర్భంగా వీటి నివారణకు గానూ పలు మందులు పిచికారీ చేయాలని సూచించారు. ఆయన వెంట క్లస్టర్ ఏఈఓ, రైతులు, రగోబా శ్రీనివాస్, అంతేశ్వర్ గొండా, ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మారంలో ఉచిత డయాబెటిక్ శిబిరం

నవతెలంగాణ-ఎడపల్లి

లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి ఆధ్వర్యంలో డయాబెటిక్ శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 65 మందికి డయాబెటిక్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జీటి కోఆర్డినేటర్ సూర్యనారాయణ, లయన్స్ క్లబ్ ఆఫ్ ఎడపల్లి అధ్యక్షులు మనోజ్ కుమార్, కార్యదర్శి రాకేష్ వర్మ, ట్రెజరర్ గంగారెడ్డి, పుష్పలత, డిసి మెర్సీ, హనుమాన్లు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-లింగంపేట్/రామారెడ్డి

విద్యార్థిని విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి పెంచడానికి చెకుముఖి టాలెంట్ టెస్ట్ నిర్వహించినట్టు మండల విద్యాధికారి షౌకత్ అలీ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలను నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన తొమ్మిది పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఒక్కొక్క పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున టాలెంట్ టెస్ట్ పోటీల్లో పాల్గొన్నారు. 8, 9, 10 తరగతుల నుంచి హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మనోధైర్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిద్ధికి, ఆయా పాఠశాల ఉపాధ్యాయులున్నారు.

రామారెడ్డి : మండల కేంద్రంలోని కేజీబీవీలో జన విజ్ఞాన వేదిక, జిల్లా విద్యాశాఖ సంయుక్తంగా నిర్వహించిన మండల స్థాయి చెకుముకి టాలెంట్ పరీక్షలో రెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల్ రెడ్డి తెలిపారు. పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని వర్షా, 9వ తరగతి విద్యార్థిని వర్షిని, 8వ తరగతి చదువుతున్న రోహిత్‌కు మండల విద్యాధికారి ఆనందరావు ప్రశంస పత్రాలను అందజేసి అభినందించారు. ప్రధానోపాధ్యాయులు గోపాల్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. ఎంపికైన విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే చెకుముకి టాలెంట్ పరీక్షలో పాల్గొంటారని తెలిపారు.

తాడ్వాయి : సైన్స్ టాలెంట్ పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్టు మండల విద్యాశాఖ అధికారి రామస్వామి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. టాలెంట్ టెస్ట్‌లో ఒక్కో పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థుల చొప్పున ఎంపికైనట్టు తెలిపారు. 28న జిల్లా కేంద్రంలో జరిగే పోటీలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక కన్వీనర్ గిర్మ బోయి, ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయ బృందం, పాల్గొన్నారు.

స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి

మహిళా శక్తి భవన నిర్మాణానికి కేటాయించే భూమిని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 కోట్లు నిధులు మంజూరు చేసిందని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా శక్తి భవన నిర్మాణానికి పట్టణ సమీపంలోని జాతీయ రహదారి నెంబర్ 44 పక్కన గల సర్వే నెంబర్ 527లో ఎకరం భూమి కేటాయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రంగనాథ్ రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, పంచాయతీరాజ్ ఈఈ దుర్గాప్రసాద్, డిపిఎం రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మాల సంఘం కమిటీ ఎన్నిక



ఎన్నికైన మాల సంఘం కమిటీ

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని బుద్ధ విహార్ కేంద్రంలో మాల సంఘం మండల కమిటీని జుక్కల్ నియోజకవర్గం అధ్యక్షులు వాగ్మారే అర్జున్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా కాట్మోడే ఆకాష్, అధ్యక్షులుగా కాట్ మోడే ఆకాష్, ప్రధాన ప్రధాన కార్యదర్శి సుభాష్, ఉపాధ్యక్షులు శ్రవణ్, ఉదయ్, జైయావర్ధన్, కోశాధికారి కాంబ్లె పవన్, జాయింట్ సెక్రటరీ శంకర్, కరణ్, సంజీవ్ బెతే, కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్, గౌతమ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రకాష్, భీమ్‌రావు, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

లిటిల్ స్కాలర్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

- విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి వియం విఠల్ డిమాండ్
- (ఎంఈఓ) ఖాళీ కుర్చీకి వినతి

నవతెలంగాణ-కామారెడ్డి

లిటిల్ స్కాలర్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి మోర్చ రాష్ట్ర కార్యదర్శి వియం విఠల్ తెలిపారు. గురువారం మండల విద్యాశాఖ అధికారి అందుబాటులో లేకపోవడంతో ఖాళీ కుర్చీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలకు ఎంఈఓ వత్తాసు పలుకుతున్నాడని అన్నారు. కామారెడ్డి మండల కేంద్రంలో ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలన్నారు. గత కొన్ని రోజుల నుంచి మండల విద్యాశాఖ అధికారికి విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. గవర్నింగ్ బాడీ లేకుండానే ఇష్టానుసారంగా ఫీజులను విద్యార్థుల నుంచి అధికంగా వసూలు చేస్తున్నారని తెలిపారు. పాఠశాల విద్యార్థులకు ఆడుకోవడానికి ఆటస్థలం లేకపోవడం వలన విద్యార్థులు మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారని, మూత్రశాలలు, మరుగుదొడ్లు విద్యార్థులకు అనుగుణంగా లేవన్నారు. పరిమితికి మించి ఆ భవనంలో విద్యార్థులకు అడ్మిషన్లను తీసుకుంటున్నారని తెలిపారు. విద్యను వ్యాపారం చేస్తున్న ఇలాంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భారతీయ విద్యార్థి మోర్చ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జ్ పేరుమల బుల్లెట్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, నాయకులు ఆర్బాస్ ఖాన్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

నవతెలంగాణ-కామారెడ్డి

మాచారెడ్డి మండలంలోని మినీ గురుకుల పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి గురువారం పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతులను పరిశీలించి, విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాలలో డిజిటల్ తరగతి గదిని పరిశీలించి, విద్యార్థులను పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు.

పరిశుభ్రత పాటించాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ
- కొత్త బస్టాండ్ కాలనీలలో పర్యాటన

నవతెలంగాణ-కామారెడ్డి

సీజనల్ వ్యాధులు వ్యాపిస్తుండడంతో ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టుపక్కల పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియా అన్నారు. గురువారం పట్టణంలోని 4, 37వ వార్డులో డ్రైనేజి, మంచినీటి సమస్య ఉందని కౌన్సిలర్ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ వార్డుల్లో పర్యటించారు. మున్సిపల్ సిబ్బందితో డ్రైనేజ్ క్లీన్ చేయించారు. అనంతరం చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. చెట్లు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణాన్ని మనం కాపాడితే మనల్ని పర్యావరణ కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్, వేణు, వార్డ్ కౌన్సిలర్, పాత శివ కృష్ణమూర్తి, పిడుగు మమతా సాయిబాబా, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-బోధన్

పట్టణంలో రోడ్డుపక్కన ప్రాంతాలలో నివసిస్తున్న నిరుపేదలకు బుధవారం రాత్రి చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దుప్పట్లు, భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి జాదవ్ ప్రవీణ్ నాయక్, రాహుల్, అప్రోస్, బైర సాయి, వినోద్ కుమార్, రాహుల్, సురేష్, కృష్ణ, సందీప్, సురేందర్, సంపత్, శ్రీనివాస్, కిరణ్ పాల్గొన్నారు.